


బాబాకి రోజూ భిక్షకి వెళ్ళనిదే తోచదు. అందులోనూ కొందరు భక్తులిళ్లకు మరీను. ఆయన భక్తులలో లక్ష్మి అనే ఒక భక్తురాలు ముఖ్యురాలు బాబాకి. పాపం ఆమె చాలా పేదది. అయినా బాబా ఆమె యింటికి భిక్షకి వెళ్లక మానరు. ఆమె ఏదో ఒకటి వేయకా మానదు.

ఎప్పటిలాగానే, అలవాటుగా ఒకరోజు బాబా ఆమె యింటిముందు నిల్చుని, ''లక్ష్మి! భిక్షకి వచ్చాడు బాబా'' అంటూ అరిచారు.

అయినా లోపలి నుంచి జవాబు రాలేదు. అలా మూడుసార్లు అరిచారు. అయినా సమాధానం రాలేదు.

దాంతో బాబా, ''సరేలే వెళ్ళొస్తాను'' అన్నారు కాస్త నొచ్చుకుంటున్నట్లుగా.

అప్పుడు లక్ష్మి బయటకు వచ్చి, కళ్ళు తుడుచుకుంటూ, ''క్షమించండి బాబా! ఈ రోజు సంతృప్తికరంగా దానం చేసేందుకు ఏమీలేక నేను బయటకి రాలేదు. వచ్చి 'ఏమీ లేవు' అని మాత్రం చెప్పలేనని మీకు తెలుసు కదా. అందుకే వెతికి వెతికి ఈ 'బియ్యం గింజ'ని తెచ్చాను. ఇదే పరమార్థమనుకోండి'' అంది బాధపడుతూనే ఆ బియ్యంగింజని జోలిలో వేస్తూ.

బాబా అది చూసి నవ్వుతూ, ''ఇందులో నీవు బాధపడాల్సింది ఏముందమ్మా? ఇది అక్షయం సుమా!'' అంటూ ఆనందంగా ముందుకు కదిలిపోయారు.

జి. రాజ్యలక్ష్మి, హైదరాబాద్

తర్వాత లక్ష్మి లోపలికి వచ్చింది. బియ్యం డబ్బా మూతవేయబోయింది.

విడ్డూరం! డబ్బా నిండా బియ్యం నిండి వున్నాయి. ఆమె ఆశ్చర్యపోయి భర్తనీ, పిల్లలనూ పెరట్లోంచి పిలుచుకు వచ్చి చూపించింది. వాళ్ళూ ఆశ్చర్యపోయారు. అంతేకాదు డబ్బాల నిండా వెచ్చాలు వగైరాలు కూడా ఉండటం, డబ్బుల పెట్టెలో డబ్బు కట్టలు ఉండటం చూసి పరమానందం చెంది ''ఆహా! బాబా ఈ పేదవారిని ఇన్నాళ్ళకి ఈవిధంగా కనికరించావా తండ్రీ! నీవు నిజంగా కరుణా మూర్తివి, దయార్ద్రహృదయుడివి'' అంటూ పొగిడి 'షిరిడీసాయి నమోనమః' అంటూ బాబా కాళ్లమీద పడి సాష్టాంగ దండప్రణామాలు ఆచరించారు సకుటుంబంగా వచ్చి.

ఆ దృశ్యం చూసిన అక్కడి భక్తులంతా ఆశ్చర్యపోయారు. వారి ఆశ్చర్యానికి సమాధానంగా - లక్ష్మి తన అనుభవంలో జరిగిన ఈ అద్భుత సంఘటనను వారికి పూసకు గుచ్చి నట్టు చెప్పి బాబా మహాత్మ్యాన్ని ఎంతగానో కొనియాడింది.

ఆమె మాటలు విన్న అక్కడి భక్తులంతా కలిసి, ''బాబా అసలు ఉదయం నుంచి ఈ మసీదు నుంచే కదలలేదు. మీ యింటికి రావటం ఏమిటీ?'' అంటూ సందేహాన్ని వెలిబుచ్చి బాబాని అడిగారు వాళ్ళు.

బాబా చిరునవ్వే సమాధానంగా ఇచ్చారు వాళ్ళకి. అప్పుడు అర్థమైంది వాళ్ళకి - బాబా విశ్వరూపాలు ధరిస్తూ, తన భక్తులను చేరి కరుణిస్తారని.

